క్లుప్తంగా

దత్తాత్రేయుని సన్నిధిలో సామూహిక వ్రతాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని సాయిబాబా మందిరంలో ప్రతిష్టించబడిన దత్తాత్రేయ స్వామి వారి సన్నిధిలో గురువారం అనఘాష్టమిని పురస్కరించుకుని సామూహిక దత్తాత్రేయ, అనఘాదేవి వ్రతాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు చావలి రాంబాబు ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక వ్రతాలలో 54 మంది దంపతులు పాల్గొన్నారు. బాబావారి ధనుర్మాస జయంతి ఉత్సవాలలో భాగంగా 3వ రోజు గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. రాత్రి పల్లకీ సేవ జరిగింది. కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం. సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేత



రేపల్లె రూరల్: నిరుపేద విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థలు అందజేసే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు పట్టణంలోని 20వ వార్డులో గుమ్మడి నాగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన నూతన వస్త్రాలను గురువారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సైతం పేద విద్యార్థులకు సహకారం అందిస్తే చదువులో వారు మరింత రాణిస్తారని అన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం 30 మంది విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ గుమ్మడి కుమార్, సభ్యులు పి.నాగబాబు, దారం సాంబశివరావు, మంద్రు రత్నప్రకాష్, ప్రదీప్, డేనియేల్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో వసతుల పరిశీలన



నగరం: పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవో హేలా షారోన్ సిబ్బందికి సూచించారు. మండలంలోని పూడివాడ గ్రామంలోని పోలింగ్ బూత్‌లను గురువా రం ఆర్డీవో పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల క మిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్‌బూత్‌లలో అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. తహసీల్దార్‌లు పోలింగ్ బూ త్‌లకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఎం ప్రమీల, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో..

చెరుకుపల్లి: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చెయ్యాలని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలను అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా షారోన్ మాట్లాడుతూ మండలంలోని 60పోలింగ్ కేంద్రాలలో ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించాలని మంచినీటిసౌకర్యం,విద్యుత్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేని పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లైతే అటువంటి కేంద్రాల వద్ద త్వరితగతిన వసతులు ఏర్పాటు చెయ్యాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కె వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి



కొల్లూరులో ఫించన్ పంపిణీ చేస్తున్న వరికూటి, తదితరులు

కొల్లూరు: పేద వర్గాల ప్రజానీకానికి ఆర్థిక కష్టాలను తొలగించడంలో బాసటగా నిలుస్తున్న ఫించన్ కానుక పెంపు ప్రజలందరికీ పండుగలాంటిదని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. గురువారం కొల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 9,303 మంది లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రూ.2.76 కోట్ల విలువైన ఫించన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసే విషయంలో కుల, మత, రాజకీయ ప్రాధామ్యాలు లేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఒక్క అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. ఓ పక్క ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ప్రజలను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కృషి చేస్తుంటే ప్రతి పక్షాలు మాత్రం అభివృద్ధిని చూసి తట్టుకోలేక దుష్ప్రచారాలు చేస్తూ సంక్షేమ పథకాలను తప్పు పట్టడం ఎంత వరకు సమంజసమో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. మోసపూరిత టీడీపీ కుయుక్తుల వలలో చిక్కుకోకుండా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువస్తే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు దక్కడం ద్వారా ప్రజలందరూ ప్రగతి పథంలో పయనించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఉప్పు శిరీష, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు సనక వెంకట్రావు, గుంటూరు నీలాంబరం, విజయ, సూరపనేని వెంకటేశ్వరరావు, శీలం అంకమ్మరావు, ఎంపీటీసీ సభ్యుడు సుగ్గున అశోక్, కోఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ తూము నాగేశ్వరరావు, ఎంపీడీవో ఐ. సత్యనారాయణరావు, ఈవో బి.మల్లిఖార్జున, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, మాజీ సర్పంచ్ కట్టుపల్లి సోమయ్య, జేసీఎస్ కన్వీనర్ అయిల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్ర బుల్లిబాబు, గంట శివరంగారావు, కూచిపూడి మోషే, శింగం కృష్ణప్రసాద్, చిలకా ప్రకాశం, కసపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్, ఆళ్లమూడి మధు, ఉప్పు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే కోన రఘుపతి



దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: అంధులకు అండగా ప్రభుత్వం ఉంటుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రపంచ బ్రెయిలీ అంధుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంధులకు దుస్తులు, కర్రలను అందజేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ప్రభుత్వం అంధుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. దివ్యాంగులకు పింఛన్లు అందించటంతోపాటు వారికి అవసరమైన పరికరాలను అందించటానికి కృషి చేస్తుందన్నారు. దివ్యాంగుల కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించిన ఎమ్మెల్యే కోన రఘుపతికి దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుంజి ఏడుకొండలు, పులి నారాయణ, నాగరాజు, సాంబయ్య, భూదేవి, రాధిక, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం ముందడుగు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్



లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న ఈవూరి, తదితరులు

రేపల్లె రూరల్: పేదలకు మంచి చేయాలన్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లను పట్టణంలోని రామకోటిపేటలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పేదలకు జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సొంత మీడియా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఖజానాపై ఎంత భారం పడుతున్నా అర్హత కలిగిన ఏ ఒక్కరికీ సంక్షేమ పథకం ఆగకూడదనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి విడతల వారీగా పింఛన్‌ను రూ.3వేలకు పెంచి అవ్వాతాతలకు బాసటగా నిలిచారని చెప్పారు. టీడీపీ హయాంలో రేపల్లె పట్టణంలో 2,520 పింఛన్‌దారులు ఉండగా నేడు 4,581 మందికి పింఛన్‌లు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో నూతనంగా పింఛన్ మంజూరైన 57 మందికి, మండలంలో 114 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీనాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే విజయం సొంతం

ఎస్పీ వకుల్‌జిందాల్



అభినందిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: నిరంతర కష్టంతోనే విజయం ప్రాప్తిస్తుందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల విడుదలైన ఎస్‌ఐ పోటీపరీక్షల ఫలితాల్లో సివిల్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించిన ఎం. వెంకటేష్‌ను గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. వెంకటేష్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించడం హర్షనీయమన్నారు. 2013 బ్యాచ్ సివిల్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలోకి ప్రవేశించిన వెంకటేష్ నగరం మండలం వుయ్యూరువారి పాలెం గ్రామంలోని ఓ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి అని వెల్లడించారు. ఓ వైపు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు ఏంతో పట్టుదలతో నిరంతరం కృషిచేసి ఇటీవల విడుదలైన ఎస్‌ఐ పోటీ పరీక్షల్లో సివిల్ ఎస్‌ఐ గా ఎంపికయ్యారన్నారు. ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎస్‌ఐ శిక్షణను విజయవంతంగా ముగించి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు

అద్దేపల్లి(భట్టిప్రోలు): అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి లూయిబ్రెయిలీ అని ఎంఈవో నీలం దేవరాజు పేర్కొన్నారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం లూయిబ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులైన చిన్నారులతో ఈ జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. దృష్టిలోపం కలిగిన విద్యార్థులను గుర్తించి సన్మానించారు. వెల్లటూరు జీసీ స్కూల్‌లో 4వ తరగతి చదువుచున్న కె. సాంబశివనాయక్‌కు సర్వ శిక్షా అభియాన్ పంపిన ల్యాప్‌ట్యాప్, బీఆర్ స్కూల్, దాసరిపాలెం, అద్దేపల్లి యూపీ, వెల్లటూరు జీసీ స్కూల్స్‌లో చదువుచున్న ఐదుగురు విద్యార్థులకు సెతస్కోప్, దుప్పట్లు, టవల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న నేత సీఎం జగన్



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరి తదితరులు

భట్టిప్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట, మ్యానిఫెస్టోలో పెట్టిన హామీని నిలబెట్టుకుంటూ రూ.3 వేలు చొప్పున పెంచిన పింఛన్‌ను లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు అందజేశారు. మండలంలోని 12 సచివాలయాల పరిధిలో పింఛన్లు అందచేశారు. భట్టిప్రోలు-2 సచివాలయం పరిధిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం(చిన్నారి), తలకొల యలమంద, మద్దుల రాముడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్స్యకారులకు బాసటగా కిసాన్ క్రెడిట్ కార్డులు



కిసాన్‌కార్డులపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

బాపట్లటౌన్: సముద్రంలో వేటసాగిస్తూ జీవనం సాగించే మత్స్యకారులను ఆదుకోవడంతో పాటు వారు వేట సామాగ్రిని కొనుగోలు చేసుకొని జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకునేందుకు కిసాన్ క్రెడిట్ కార్డుతో ప్రభుత్వం రుణాలు అందిస్తున్నట్లు సచివాలయ మత్స్యకార సహాయకులు జి. మరియదాస్ తెలిపారు. మండలంలోని అడవి పంచాయతీలోని రామచంద్రాపురం గ్రామంలో గురువారం సాగర పరిక్రమ కార్యక్రమంలో భాగంగా కిసాన్ క్రెడిట్ కార్డులు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన బోట్ ఓనర్లు, మత్స్యకార మహిళలు, మత్స్యకార చిరు వ్యాపారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అవశ్యకత గురించి వివరించారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రూ.50వేల నుంచి రూ.1.60 లక్షల వరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తామన్నారు. ఈ ఋణాన్ని 7శాతం వడ్డీతో ఇస్తారని రుణాలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తే వడ్డీలో 3శాతం వెనక్కి లబ్ధిదారులకు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమములో గ్రామ మత్స్య సహాయకులు అంకిరెడ్డి, సాగర మిత్రలు యాసిన్ , హారిక పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కర్లపాలెం: మండలంలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మల్లకంబ్ ఆటల పోటీలలో రాణిస్తూ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ నెలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాలలో రాష్ట్ర జట్టుకు జరిగిన సెలక్షన్స్‌లో అండర్-14, 17,19 విభాగాలలో ఐదుగురు విద్యార్థులు మెరుగైన ప్రతిభకనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటరాజు తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో కె.జయచంద్రారెడ్డి, అండర్-17 బాలుర విభాగంలో కార్తీక్‌రెడ్డి, అండర్-17 బాలికల విభాగంలో పి.అనూరాధారెడ్డి, ఎం.జాహ్నవి, అండర్-19 బాలికల విభాగంలో పి.జెస్సికా మెరుగైన ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.గోపి వెల్లడించారు. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో జరిగే జాతీయ స్థాయి మల్లకంబ్ పోటీలలో మన రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్న కాలనీలో లేఅవుట్ పరిశీలన



భట్టిప్రోలు: భట్టిప్రోలు జగనన్న కాలనీలో జరుగుతున్న లేఅవుట్ పనులను వేగవంతం చేయాలని కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ కోరారు. గురువారం స్థానిక లేఅవుట్‌ను ఎంపీడీవో, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. లేఅవుట్‌లోకి వెళ్ళేందుకు సరైన మార్గం లేక నానా అవస్థలు పడుతున్నామని మెటీరియల్ వాహనదారులు అధికారులకు విన్నవించారు. మెటీరియల్ తెచ్చుకోవాలంటే ట్రాక్టర్లు, టైరుబళ్లు ఇరుక్కుపోతున్నాయని గత్యంతరం లేని పరిస్థితుల్లో మెటీరియల్‌ను అక్కడే దించేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రధాన రహదారి అభివృద్ధి చేస్తే లబ్ధిదారులకు ఇళ్ళ నిర్మాణం చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందని సలీమ్ అధికారులకు సూచించారు. స్పందించిన అధికారులు పరిస్థితిని చక్కదిద్దుతామని స్థానికులకు భరోసా కల్పించారు. అద్దేపల్లిలో పెరిగిన పింఛన్ మొత్తాన్ని పింఛన్‌దారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, పంచాయతీరాజ్, హౌసింగ్ ఎఈలు శేతు రామచంద్రరరావు, రావూరి సౌమ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వర్జిల్ సాగర్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

బాపట్ల అర్బన్: బాపట్ల మండల వైఎస్సార్‌సీపీ నూతన కమిటీని గురువారం ఆ పార్టీ వెల్లడించింది. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ కమిటీలో బాపట్ల మండల అధ్యక్షునిగా కోకి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులుగా జొన్నలగడ్డ ఇస్సాకు, ఇందేటి నరేస్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా పిట్టు శ్రీనివాసరెడ్డి, మోర్ల సముద్రాల గౌడ్, జాస్తి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నామా చక్రపాణి, కార్యదర్శులుగా గోసాల కోదండం, ముఖర్జీ, రాగాల చిన్న కోటేశ్వరరావు, వలిబాబు, నక్కల భూలక్ష్మి, కార్య నిర్వాహక సభ్యులుగా తుపాకుల బేబీ, జంపాని రోశమ్మ, కొక్కిలిగడ్డ నాగరాజు, విచారపు శ్రీనివాసరావు, రాఘవ, బొనిగల డేవిడ్ రాజ్, అద్దంకి వెంకటేశ్వర్లు, గవిని శ్రీను, కాశి కిషోర్, అశ్విని, నత్తల శామ్యూల్, శాంసోన్ మర్రిపూడి, చేబ్రోలు రామారావు, ఆసోది కృష్ణ, కోట ఉషారాణి సుబ్బారెడ్డి నియమితులయ్యారు.

గోవా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



సూరేపల్లి(భట్టిప్రోలు): బాపట్ల జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆదేశాలతో రేపల్లె సెబ్ స్టేషన్ పోలీసు సిబ్బంది గోవా లిక్కర్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. సూరేపల్లికి చెందిన బొర్రా అంకమ్మరావు గోవా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు సెబ్ సిబ్బంది దాడి చేయగా 7 గోవా మద్యం బాటిళ్ల లభ్యమయ్యాయి. నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సిబ్బంది తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

డీఈవో పీవీజే రామారావు



యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో రామారావు, ఉపాధ్యాయులు

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లాలో విద్యాభివద్ధికి టీచర్స్ యూనియన్ కృషి చేయాలని విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. గురువారం ఏపీ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌టీవీ సురేష్‌లు డీఈవో రామారావును ఆయన కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ త్వరగా పూర్తిచేసి రివిజన్ ప్రారంభించాలని కోరారు. సమయం ముగిశాక స్టడీ అవర్స్ నిర్వహించాలని డైలీ టెస్ట్, మోడల్ టెస్ట్ జరపాలని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు మంచి నడవడిక నేర్పాలని సూచించారు. అనంతరం యూనియన్ నేతల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ సభ్యులు ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రం డీఈవో రామారావుకు అందజేశారు. డీఈవోను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

వృద్ధులకు కంటిఅద్దాల పంపిణీ

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారంతా వినియోగించుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. నల్లమోతువారిపాలెం గ్రామ సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గతంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కళ్ళకు శస్త్రచికిత్స చేయించుకున్న 31మందికి ప్రభుత్వం నుంచి వచ్చిన కళ్ళజోళ్ళను సాంబశివరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు తాండ్ర పద్మావతి, తాండ్ర సామ్రాజ్యం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై పోలీసు దాడులు



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

నగరం: గ్రామాల్లో నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని జిల్లేపల్లి గ్రామంలో గురువారం సెబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నాటుసారా తయారు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నాటుసారా తయారుచేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించగా జిల్లేపల్లిలో బెల్లంఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా ఇంకా ఎవరెవరు తయారు చేస్తున్నారనే కోణంలో విచారణ చేస్తున్నట్లు వివరించారు. గ్రామాలలో ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నా, విక్రయాలు జరుగుతున్నా సెబ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

మొబైల్ ఫోన్లు అందజేత

కర్లపాలెం: ప్రయాణం చేసే సమయంలో ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లు చోరీకి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య తెలిపారు. కర్లపాలెం పరిధిలో ఇటీవల చోరీకి గురైన రెండు మొబైల్ ఫోన్‌లను వాటి యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రికవరీ చేశామని తెలిపారు. బుధవారం స్టేషన్‌లో మొబైల్ యజమానులైన యాజలి సురేష్, షేక్ సౌకత్‌లకు వీటిని ఎస్‌ఐ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా వేరే వారి మొబైల్ దొరికినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందించాలని వాటిని మొబైల్ యజమానులకు అందజేస్తామని తెలిపారు.